క్లుప్తంగా

క్షతగాత్రుడికి పరామర్శ



బాలకృష్ణను పరామర్శిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

సింధియా: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలై జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీలోని నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు బాలకృష్ణను సోమవారం పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఆడారి ఆనంద్‌కుమార్, వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావుతో కలిసి పరామర్శించారు. కార్యక్రమంలో వరపల మహేష్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సింధియా: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన 62వ వార్డు త్రినాథపురం ప్రాంతానికి చెందిన వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్ ఎదురు కమలారెడ్డి కుటుంబ సభ్యులను సోమవారం వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ ఆడారి ఆనంద్‌కుమార్ పరామర్శించి, కమలారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు, కార్యకర్తలు ఉన్నారు.

కొండవాలు ప్రాంతంలో ఉచిత భోజనం



భోజనం వడ్డిస్తున్న రమణ

విశాఖ విద్య: తుపాను నేపథ్యంలో 90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్ ఏరియా కొండవాలు ప్రాంత కుటుంబాల వారికి అక్షయ పాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత భోజన సదుపాయం కల్పించారు. కార్పొరేటర్ బొమ్మిడి రమణ మాట్లాడుతూ విపత్తుల సమయంలో అక్షయ పాత్ర ఫౌండేషన్ ఇటువంటి కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పిల్లల మాణిక్యం, జ్యోతి, వెంకటలక్ష్మి, రాధ, లక్ష్మి పాల్గొన్నారు.

10న పంచారామాల యాత్రకు ప్రత్యేక బస్సు

గోపాలపట్నం: ఈ నెల 10న సింహాచలం బస్ డిపో నుంచి పంచారామాలకు ప్రత్యేక బస్సు నడపనున్నట్టు సింహాచలం డిపో మేనేజర్ కె. రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు ద్వారా అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్ల కోటలో ఉన్న పలు ఆలయాలను దర్శించుకోవచ్చని పేర్కొన్నారు. 10వ తేదీ సాయంత్రం 5 గంటలకు బయలుదేరుతుందన్నారు. టికెట్ ఒక వ్యక్తికి రూ.1600గా నిర్ణయించామని తెలిపారు. పూర్తి వివరాలకు 9493226922, 7382917295 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆధ్యాత్మిక గ్రంథాల ప్రచారం



ఆధ్యాత్మిక గ్రంథాలతో సభ్యులు

కంచరపాలెం: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి, జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఊర్వశికూడలి, ఐటీఐ జంక్షన్ ప్రాంతాల్లో సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీత, ఆధ్యాత్మిక గ్రంథాల ప్రచారం నిర్వహించారు. కార్తీకమాసం 12 వరకు యోగ సాధన చేయడానికి గుర్తుగా దీపాలను నిత్యం వెలిగించాలని కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. ముందుగా ఆధ్యాత్మిక గ్రంథాల పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో దేవి, మంగ, పద్మ, మల్లేష్, గణేష్, శ్రేయ, అరుణ్, రామకృష్ణ, అంబిక, అప్పారావు, మహలక్ష్మి, లక్ష్మి, సర్వధారి, అక్షయ్‌కుమార్, రమణ తదితరులు పాల్గొన్నారు.

మాట ఇచ్చారు.. అభివృద్ధి చేశారు

నాడు

శిథిలమైన మెట్ల మార్గాలు.. డ్రైనేజీలకు అనుసంధానం లేక పోవడంతో రోడ్డుపై మురుగుపారదంతో రోడ్డుపై నడవలేని స్థితి. చిన్న వర్షానికే మురుగు ఎక్కడికక్కడ నిలిచిపోయి రోడ్లు దుర్గంధభరితంగా ఉండేవి. కల్వర్టులపై పలకలు శిథిలమై వాహనాల రాకపోకలకు అవస్థలు పడేవారు.

నేడు

ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం అన్ని వార్డుల్లో మౌలిక వసతులకు అధిక ప్రాధాన్యం కల్పించింది. అభివృద్ధి పనుల్లో భాగంగా కొండవాలు ప్రాంతాల్లో మెట్ల మార్గాలు నిర్మించారు. సీసీ రోడ్లు వేశారు. వీధి రోడ్లను అభివృద్ధి చేసి అవసరమైన చోట కల్వర్టులు నిర్మించారు. పాదచారులు, వాహనచోదకులకు రాకపోకలకు మార్గం సుగమం అయింది.

59వ వార్డులో రూ.4 కోట్లతో అభివృద్ధి పనులు | మెట్ల మార్గాలు, రోడ్ల నిర్మాణం | మారిన వార్డు రూపురేఖలు

మల్కాపురం: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజల వద్దకు వెళ్లారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. వాటిని కొన్ని నెలల వ్యవధి లోనే పరిష్కరించి అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చూపించారు. అది వైఎస్సార్ సీపీ పార్టీ ప్రభుత్వం గొప్పతనం. టీడీపీ ప్రభుత్వ పాలనలో 59వ వార్డు కొండ ప్రాంతాల్లో అభివృద్ధి శూన్యం. నేడు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోని ప్రాంతాలను ప్రగతి బాట పట్టించారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

59వ వార్డు పరిధిలో జరిగిన అభివృద్ధి పనులు, ఖర్చు చేసిన నిధుల వివరాలు క్లుప్తంగా.

- ములగాడ హౌసింగ్‌కాలనీ వద్ద రూ. కోటితో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మించారు.
- ములగాడ హౌసింగ్‌కాలనీ పరిధిలో సీసీ రోడ్ల కోసం రూ. 25 లక్షలు వెచ్చించారు.
- శాంతినగర్ కొండ ప్రాంతంలో సీసీ రోడ్డు,సీసీ మెట్లు మార్గానికి రూ. 16 లక్షలు
- ఎక్స్‌సర్వీస్‌మెన్‌కాలనీలో సామాజికభవనం నిర్మాణానికి రూ. 25. లక్షలు
- హిమాచల్‌నగర్ కొండ ప్రాంతంలో సీసీ రోడ్డు వేయడానికి రూ. 30 లక్షలు
- వాయుపుత్రకాలనీ పరిధిలో సీసీ రోడ్డుకు రూ. 30 లక్షలు
- ఎక్స్‌సర్వీస్‌మెన్‌కాలనీ పరిధిలో బీటీ రోడ్డు నిర్మాణం – రూ. 29.50 లక్షలు
- నక్కవానిపాలెం పరిధిలో సీసీ రోడ్డు, మెట్ల మార్గానికి రూ. 20 లక్షలు
- హిమాచల్‌నగర్ కొండ ప్రాంతంలో సీసీ రోడ్డు,సీసీ మెట్లు రూ.30 లక్షలు
- హిమాచల్‌నగర్ ప్రాంతంలో బీటీ రోడ్డు రూ. 10 లక్షలు
- హిమాచల్‌నగర్ ప్రాంతంలో సామాజికభవనం కోసం రూ. 10 లక్షలు



నాడు:హనుమాన్‌సంజీవ్ కాలనీ కొండ ప్రాంతంలో మట్టిరోడ్డు





నాడు: శాంతినగర్‌లో శిథిలమైన రోడ్డు



నేడు: శాంతినగర్‌లో రూ.16 లక్షలతో వేసిన సీసీ రోడ్డు



నేడు: కొండ ప్రాంతంలో వేసిన సీసీ రోడ్డు

ఆదర్శవంతంగా తీర్చిదిద్దాం



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇక్కడ పలు ప్రాంతాల ప్రజలకు ఇచ్చిన హామీలను కొద్ది నెలల వ్యవధిలోనే పరిష్కరించి చూపించాం. వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం.వార్డులో ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని అర్బన్ హెల్త్‌సెంటర్ నిర్మించాం. ప్రజలకు ప్రజారోగ్యాన్ని చేరువ చేశాం. అధ్వానంగా ఉన్న కొండ ప్రాంతాల్లో వసతులు కల్పించాం. సీసీ రోడ్లు,మెట్లు మార్గాలు ఏర్పాటు చేసి అభివృద్ధి చూపించాం.

– ఆడారి ఆనంద్‌కుమార్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త

మరిన్ని అభివృద్ధి పనులు చేస్తాం



ఎన్నికల సమయంలో,గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి పనులు చేస్తున్నాం. గతంలో ఎన్నడూ లేని విధంగా కోట్లాది రూపాయలతో రోడ్డు, మెట్ల మార్గాలు నిర్మించాం. పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ చొరవతో వార్డులో మరిన్ని పనులు త్వరలో చేపడతాం.

– పుర్రె పూర్ణశ్రీయాదవ్, 59వ వార్డు కార్పొరేటర్

ప్రజల చెంతకే సేవలు



నూతన సచివాలయంలో పూజలు చేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్, కార్పొరేటర్ లక్ష్మణరావు తదితరులు

- వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి
- త్రినాథపురంలో నూతన సచివాలయ భవనం ప్రారంభం

సింధియా: ప్రజల చెంతకు సేవలు అందించడానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురంలో నూతనంగా నిర్మించిన వార్డు సచివాలయం భవనాన్ని సోమవారం వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు బల్ల లక్ష్మణరావుతో కలిసి ఆనంద్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువలో ఉండాలనే ఉద్దేశంతో ఏర్పడిన సచివాలయ వ్యవస్థ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. సీఎం వైఎస్ జగన్ పేదరిక నిర్మూలనకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఆర్థిక భరోసా కల్పించడంతో పేదల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. రానున్న రోజుల్లో పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి మరిన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వారి జీవితాల్లో మరిన్ని వెలుగులు నింపనున్నారని అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలంతా మరలా వైఎస్సార్‌సీపీకే పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, భీశెట్టి గణేష్, సచివాలయ జేఏసీ కన్వీనర్ భోగవిల్లి నాగభూషణం, సచివాలయ కన్వీనర్లు సత్యనారాయణ, సూర్యనారాయణ, చంటి ,ఆర్పీలు, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

మార్గశిర మాసోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



మార్గశిర మాసోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానం మార్గశిర మాసోత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సోమవారం ఆవిష్కరించారు. ఆలయ ఈవో కె.శిరీష, ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం నేతృత్వంలో ఆశీల్‌మెట్ట సమీపాన అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వాసుపల్లి మాట్లాడుతూ మార్గశిర మాసోత్సవాలు వైభవంగా నిర్వహించాలని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు ధనలత, అనురాధ, సతీష్, మారుతీప్రసాద్, సురేష్, ప్రకాష్, సహాయ ఈవో తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



చిన్నారులతో కేక్‌కట్ చేయిస్తున్న ఆనంద్‌కుమార్

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురంలోని స్పిరిట్ ఆఫ్ యూనిటీ పాస్టర్స్ ఫెల్లోషిప్ , ఇవాంజి లిస్ట్ ఫెల్లోషిప్ చైర్మన్ చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ ఆడారి ఆనంద్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పాస్టర్స్ ఆనంద్‌కుమార్‌ను శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ పేదలను ప్రేమించాలన్న ఏసుక్రీస్తు సందేశమే ప్రపంచ శాంతికి ముక్తి మార్గమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బల్ల లక్ష్మణరావు, గుండపు నాగేశ్వరరావు, స్పిరిట్ ఆఫ్ యూనిటీ పాస్టర్స్ ఫెల్లోషిప్ , ఇవాంజి లిస్ట్ ఫెల్లోషిప్ అధ్యక్షులు ఎస్.బి.సింగ్, రెవరెండ్ భూషణరావు, ఇస్రాయెల్ రాజు, విశాఖ జిల్లా క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు అద్దేపల్లి రవిబాబు, సూరాడ అనుదీప్, ఫెలోషిప్ సభ్యులు , పలువురు మత పెద్దలు పాల్గొన్నారు.

తుపానుతో అప్రమత్తంగా ఉండాలి

డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్



ఓల్డ్ కరాసలో పర్యటిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

విశాఖ విద్య: తుపాను నేపథ్యంలో ప్రజానీకానికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అధికారయంత్రాంగం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ సూచించారు. సోమవారం 52వ వార్డు ఓల్డ్ కరాస, శాంతి నగర్ ఏరియాల్లో పర్యటించారు. జోరుగా వర్షాలు కురుస్తున్నందున పారిశుధ్య చర్యలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయా వార్డుల పారిశుధ్య సిబ్బందికి సూచించారు. వర్షపు నీరు ఎక్కడా నిల్వ లేకుండా చూడాలన్నారు. ఓల్డ్ కరాసలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలించారు. అంతా సమన్వయంతో పనిచేసి, ప్రజలకు అన్ని రకాల మౌలిక సౌకర్యాలు కల్పించేలా పనిచేయాలన్నారు.

కొత్తపాలెంలో పర్యటించిన జెడ్సీ



కొత్తపాలెం గెడ్డలో పూడికల తొలగింపును పరిశీలిస్తున్న జెడ్సీ మల్లయ్య నాయుడు

గోపాలపట్నం: మిచాంగ్ తుపాను నేపథ్యంలో జోన్– 8 కమిషనర్ మల్లయ్య నాయుడు కొత్తపాలెం ప్రాంతంలో సోమవారం పర్యటించారు. ఇక్కడి గెడ్డలను పరిశీలించారు. వర్షపు నీరు గెడ్డల్లో సజావుగా వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని శానిటరీ అధికారులకు సూచించారు. కొత్తపాలెం నుంచి నరవ వెళ్లే రహదారిలో కాలువల్లో పూడికలు తొలగించాలని ఆదేశించారు. రోడ్డుకు దిగువ ప్రాంతాల్లో ఉన్న కాలువలను బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఏటా వర్షాలు పడే సమయంలో ముంపు సంభవిస్తుందోని వాపోతున్నారు. అధికారులు దీనిపై తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల ఆవేదన దీక్ష

సీతమ్మధార : జిల్లా సమగ్ర శిక్ష అభియాన్‌లో 12 ఏళ్లుగా కాంట్రాక్ట్ విధానంలో పని చేస్తున్న ఉద్యోగులు సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆవేదన దీక్ష చేపట్టారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. జేఏసీ అధ్యక్షుడు వి.పుండరీకాక్ష మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల గడుస్తున్నా ఎటువంటి ఉద్యోగ భద్రత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం మినిమం టైం స్కేల్ అమలు చేస్తామని చెప్పి ప్రభుత్వం హామీ ఇచ్చినా నేటికి అమలు చేయలేదన్నారు. రాష్ట్ర సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 20న నుంచి సమ్మె బాట పట్టాలని ప్రభుత్వానికి నోటీసులు అందజేసినట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా ఈ నెల 11న విజయవాడలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు పి.గణపతిరావు, ఎల్.చైతన్య, టి.శ్రీరామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

తెరిపివ్వని వాన





వర్షానికి గోపాలపట్నం బంక్ జంక్షన్‌లో గొడుగులు వేసుకుని వెళ్తున్న కళాశాల విద్యార్థులు

- వణికిస్తున్న చలిగాలులు
- రోజంతా కురిసిన వాన
- ఇళ్లకే పరిమితమైన ప్రజలు

గోపాలపట్నం: మిచాంగ్ తుపాను ప్రభావంతో వాతావరణం ఒక్కసారి చల్లబడింది. సోమవారం ఉదయం నుంచి వర్షం ముసురులా పట్టుకుంది. సాయంత్రం తర్వాత తెరిపివ్వకుండా పడుతూనే ఉంది. మరో వైపు చలిగాలులు వీయడంతో ప్రజలు వణికిపోయారు. ప్రజలంతా ఇళ్లకే పరిమితమయ్యారు. అత్యవసర అవసరాల కోసం బయటకు వచ్చిన వారు గొడుగులను ఆశ్రయించారు. తుపాను కారణంగా పాఠశాలలకు సెలవు ప్రకటించడంతో విద్యార్థులు రోడ్లపైకి రాలేదు.

ప్రజా భాగస్వామ్యంతోనే 'ఉక్కు' పరిరక్షణ



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ఉద్యమంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. ప్రజా భాగస్వామ్యంతోనే ఉక్కు పరిరక్షణ సాధ్యమన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1026వ రోజుకు చేరుకున్నాయి, ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ అమరుల ప్రాణ త్యాగంతో ఏర్పాటైన ఉక్కు పరిశ్రమను కాపాడుకోవడం అందరి బాధ్యత అన్నారు. ప్రధాని మోదీ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై నిర్విరామ పోరు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌టీఎల్‌లో స్వచ్ఛత పక్షోత్సవాలు



స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్

గోపాలపట్నం: స్వచ్ఛతను ప్రతీ ఒక్కరూ వ్యాపకంగా మార్చుకోవాలని వర్క్స్ అండ్ ఎస్టేట్ విభాగాధిపతి లెఫ్టినెంట్ కల్నల్ రాహుల్ దీక్షిత్ అన్నారు. స్వచ్ఛతా పక్షోత్సవాలను సోమవారం ఎన్ఎస్టీఎల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ నెల 15 వరకు స్వచ్ఛతపై పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ మాట్లాడుతూ మానవాళి శ్రేయస్సు కోసం మన ఆరోగ్యం కోసం పరిశుభ్రతను పాటించాలన్నారు.కాలుష్య స్థాయిని తగ్గించడం కోసం అందరూ తమ వంతు కృషి చేయాలని కోరారు. ఉద్యోగులంతా చురుకైన పోషించి స్వచ్ఛభారత్ కలను సాకారం చేయాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు హెచ్ ఎస్ దాస్, సీహెచ్‌వీ సత్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.